క్లుప్తంగా

మరిడమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ ఈవో కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, దాతల సహకారంతో ఈ వారం నుంచి అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి దాతలు సహకరించాలని కోరారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం

సామర్లకోట: స్థానిక అయోధ్య రామపురంలో ఉన్న సత్తెమ్మతల్లి ఆలయం వద్ద రూ.3.50 లక్షలతో నిర్మాణం చేసిన ముఖద్వారాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు ఆదివారం ప్రారంభించారు. శరన్నవరాత్ర ఉత్సవాల సమయంలో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురికావడంతో షెడ్‌తో పాటు ముఖద్వారం నిర్మాణం చేశారు. కార్యక్రమంలో సిద్ధాంతి చీమలకొండ ప్రసాద్, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ కౌన్సిలర్ బడుగు శ్రీకాంత్, సరోజ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు

సామర్లకోట: మండలంలోని గొంచాలలో ఉన్న కనకదుర్గ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. గ్రామ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో పండగ వాతావరణం ఏర్పడింది.

హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు

పెద్దాపురం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక వర్తుల వారి వీధిలో ఉన్న భువనేశ్వరి అమ్మవారిని పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. బ్రాహ్మణోత్తములు, గోపిశర్మ శిష్య బృందం వేద మంత్రోచ్చారణల మధ్య పీఠం నుంచి భువనేశ్వరి అమ్మవారిని హంస వాహనంపై కోలాట బృందం వాయిద్యాల నడుమ మెయిన్‌రోడ్డు, వెంకటేశ్వర స్వామి గుడి, దర్గా సెంటర్, మరిడమ్మ అమ్మవారి ఆలయం మీదుగా పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. గోపిశర్మ మాట్లాడుతూ, గత 26 ఏళ్లుగా అమ్మవారి పీఠంలో నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. సోమవారం నుంచి అక్టోబర్ 2 వరకూ ఉత్సవాలను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మట్టే శ్రీనివాసరావు, మండ ప్రకాష్, పాలకుర్తి సతీష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం


కొండెవరంలో ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ

కొత్తపల్లి: మండలంలో శరన్ననవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయాలను సుందరాతి సుందరంగా అలంకరించారు. కొత్తపల్లిలో ఉన్న శ్రీధర్మశాస్తా ఆలయంలో దసరా ఉత్సవాలను నిర్వాహణకు భారీ ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించనున్నారు. వాకతిప్ప, ఉప్పాడ, కొండెవరం, కొమరగిరి, యండపల్లి తదితర గ్రామాల్లో ఉన్న అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో ఇప్పటికే సుందరంగా అలంకరించారు.

చిత్రలేఖనంలో చిన్నారికి బహుమతి


చిత్రలేఖనంలో బహుమతి పొందిన సహస్ర

సామర్లకోట: మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో సామర్లకోటకు చెందిన మూడో తరగతి చదువుతున్న చిన్నారి సహస్ర ప్రథమ బహుమతి గెలుచుకుంది. సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్ విభాగాల్లో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించినట్లు పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. బహుమతి పొందిన చిన్నారిని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్, మదర్ థెరిస్సా వాలంటరీ ఆర్గనైజేషన్ అధినేత రాజు అభినందించారు.

కాపర్ చోరులు

- ముఠాలుగా ఏర్పడి దొంగతనం చేస్తున్న దుండగులు
- ప్రాణాంతకమని తెలిసినా బరి తెగింపు
- పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మాయం


ఆర్‌బీపట్నంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌ను చోరీ చేసిన దృశ్యం(ఫైల్)

పెద్దాపురం: ఇటీవల రాయభూపాలపట్నం గ్రామం పంట పొలాల్లోని టాన్స్‌ఫార్మర్‌లో విలువైన రాగి తీగ చోరీకి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధ రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి అందులో రాగి వైర్‌ను అపహరించుకుపోయారు. ఇదే ఘటన గత ఆరు నెలల కిందట గండేపల్లి మండలంలో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లల్లో రాగి తీగను దొంగలించారు. దీనిపై పోలీసులకు సైతం ఫిర్యాదు అందింది. ఐది ఇలా ఉండగా పెద్దాపురం మండల పరిధిలోని మెట్ట గ్రామంలో పలు చోట్ల పంట పొలాల్లో విద్యుత్ టాన్స్‌ఫార్మర్లు తరచూ చోరీకి గురవుతున్నాయి. ఏటా రబీలో పంట పొలాలకు నీరందించేందుకు రైతులు మోటార్లను అమర్చుకుంటారు. అర్ధరాత్రి పొలాల్లో దొంగలు చొరబడి వాటిని అపహరిస్తున్నారు. విద్యుత్ వైర్లను తొలగించి అందులో కాపర్(రాగి) దొంగిలించి విక్రయిస్తున్నారు. చీకటిలో విద్యుత్ వైర్లను కట్ చేయడం ప్రాణాంతకమని తెలిసినా వెనక్కి తగ్గడంలేదు. ప్రస్తుతం వ్యవసాయానికి ఏడు గంటల మాత్రమే సరఫరా ఉంటుంది. అది కూడా రెండు విడతలుగా అందిస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. దీంతో విద్యుత్, రైతులు లేని సమయాల్లోనే దొంగలు చోరీలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఇటువంటి చోరీలు జరుగుతున్నా కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. ప్రధానంగా దుండగులు పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్నారు. పదేళ్ల కిందట ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చగా వాటిలో 14 కిలోల కాఫర్ వస్తోంది. మార్కెట్‌లో కిలో కాఫర్ ధర 2500 పలుకుతోంది. దీంతో ఒక్కో ట్రాన్సఫార్మర్‌లో కాఫర్ చోరీ చేస్తే రూ.30 వేలకు పైగా సొమ్ము చేసుకోవచ్చని దొంగలు భావిస్తున్నట్లు తెలిస్తోంది. ఈ కాఫర్‌ను బరంపురం, కటక్, జైపూర్ వంటి ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నట్లు సమాచారం. చోరీ నుంచి కాపర్ కొనుగోలు చేసే వరకు ఒక ముఠా నడుస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రైతులకు ఇబ్బందులే..

సాధారణంగా 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల విలువ సుమారు నాలుగు లక్షల వరకు ఉంటుంది. దీనిలో కాపర్ విలువ సుమారు 75 వేల వరకు ఉంటుంది. కాపర్ చోరీ కావడంతో దాని కంటే తక్కువ ధరకు లభించి అల్యూమినియాన్ని విద్యుత్ శాఖాధికారులు ట్రాన్స్‌ఫార్మర్లలో అమరస్తున్నారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కారణంగా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. దొంగలు విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కట్ చేసి అలానే వదిలేస్తుండడంతో రైతులు పొరపాటున వాటిని తాకితే ప్రమాదాలు జరుగుతాయి. పదుల సంఖ్యలో రైతులు సొంత సొమ్ములు వేసుకుని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్న పరిస్థితి నియోజకవర్గంలో ఉన్నాయి. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతులు రాయితీ పోను రూ.90 వేల వరకు కట్టాల్సి ఉంటుంది. ఈవి చోరీకి గురైతే సాగునీటి సరఫరాలో ఇబ్బందులతో పాటు తమపై అదనపు భారం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీస్ శాఖ దృష్టి సారించిన దాఖాలాల్లేవని, ఇప్పటికైనా సంబంధిత పోలీస్ శాఖ పట్టించుకోవాలని మెట్ట రైతాంగం కోరుతోంది.

ప్రమాదాలకు అవకాశం



పొలాల్లో వ్యవసాయ బోర్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు స్థానంలో కొత్తది అమర్చే సరికి చాలా సమయం పడుతుంది. ఇంతలో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. విద్యుత్ వైర్లు కత్తిరించడంతో చాలా చోట్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి పాల్పడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేయాలి. రైతులను రక్షించాలి.

–నల్లల గోవిందు, రైతు, కట్టమూరు, పెద్దాపురం మండలం

అంధకారంలో నారాయణ స్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక అతిపూరాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి ఆలయం అంధకారంలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారని, అయితే కరెంటు పోయిన సమయంలో ఇన్వెర్టర్ పని చేయకపోవడంతో భక్తులు చీకటిలోనే స్వామిని దర్శించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయంపై దృష్టి సారిస్తున్న అధికారులు భక్తుల సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారనే విమర్శలున్నాయి. ఆలయం అతిపూరాతనమైనది కావడంతో రాతితో నిర్మాణం చేయడంతో పాటు చిన్న చిన్న ద్వారాలు ఉండటంతో ఆలయంలోకి వెలుతురు వచ్చే అవకాశం లేదు. ఇప్పటికైనా అధికారులు ఇన్వెర్టరుకు మరమ్మతులు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

గృహ నిర్మాణ రంగంపై శిక్షణ

సామర్లకోట: పట్టణంలోని సీబీఎం సెంటర్‌లో ఉన్న న్యాక్ శిక్షణా కేంద్రంలో నిరుద్యోగ యువతకు గృహ నిర్మాణ రంగంలో సర్వేయింగ్ కోర్సు, ప్లంబింగ్ కోర్సులపై ఈనెల 29 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని సెంటర్ కో–ఆర్డినేటర్ ఆర్ఎస్ఎస్ఎస్ శివ తెలిపారు. ఈ కోర్సు 75 రోజుల శిక్షణ ఉంటుందని, ఐటీఐ, డిప్లొమో, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. ప్లబింగ్ కోర్సు 50 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, దీనికి 10, ఇంటర్ పూర్తి చేసి 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్నవారు అర్హులన్నారు. ఈ శిక్షణలో లైఫ్ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్ నేర్పించనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, 4 ఫొటోలతో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈ సర్టిఫికెట్ల ఆధారంగా దేశ, విదేశాలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. వివరాలకు 9440756250, 9666771726, లేదా 7386406664లకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

సామర్లకోట: మండలంలోని అచ్చంపేటలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్ల మార్పులను పురస్కరించుకొని సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎవీఎస్‌డీఎస్ ప్రభాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పనసపాడు, కొప్పవరం, అచ్చంపేట, వాకలపూడి, వేట్లపాలెం, ఇండస్ట్రియల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రయాణికుడు

సామర్లకోట: కాకినాడ వెళ్లే రోడ్డులో సామర్లకోట నుంచి కాకినాడ వెళుతున్న ఓ ప్రయాణికుడు ఆదివారం స్కూటీపై వికే రాయపురం సమీపంలో రోడ్డుపై ఉన్న గోతులను గమనించకపోవడంతో స్కూటీ గోతిలో పడి బోల్తా పడింది. దీంతో ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనను గమనించిన స్థానికులు హుటాహుటిన క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా వివరాలు రావాల్సి ఉందన్నారు.

చిత్రలేఖనం పోటీలు


పోటీలను పర్యవేక్షిస్తున్న ఏడీఈఎన్, స్టేషన్ మేనేజర్లు

సామర్లకోట: ప్రతి ఏడాది రైల్వే ఉమ్మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు, కార్మికుల పిల్లలకు నిర్వహిస్తున్న వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో భాగంగా ఆదివారం స్థానిక రైల్వే కల్యాణ మండపంలో డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. 6 నుంచి 9 ఏళ్లు ఉన్న విద్యార్థులకు ఇష్టమైన జంతువు, 10 నుంచి 12 ఏళ్లు ఉన్న వారికి సూపర్ హీరో, 13 నుంచి 15 ఏళ్ల వయసు కలిగిన విద్యార్థులకు పండగ సంబరాలపై మూడు కేటగిరిలుగా విభజించి పోటీలు నిర్వహించిన్నట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. ఈ డ్రాయింగ్ పోటీల్లో 62 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారందరికి సర్టిఫికేట్లు, బహుమతులు అందజేశారు. రెండు ఆదివారాలు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న వారి పేపర్లను విజయవాడ రైల్వే డివిజన్ కార్యాలయానికి పంపిస్తారు. న్యాయ నిర్ణేత సమక్షంలో డివిజన్ వ్యాప్తంగా జరిగిన పేపర్లు పరిశీలించి ప్రతి రైల్వే స్టేషన్ నుంచి ఆయా కేటగిరిలల్లో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అక్టోబరు 2న విజయవాడలో అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఈఎన్ శివప్రసాద్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, రైల్వే సూపరింటెండెంట్ శ్రీనివాసు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి పాల్గొన్నారు.

అధికారం కోసం అబద్ధాలు


గోర్సలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: చంద్రబాబు తన రాజకీయ జీవితం మొత్తంలో ఇచ్చిన మాటకు ఏ రోజైన కట్టుబడి ఉన్నారా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు లేని పోని వాగ్దానాలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చడం లేదని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అనాల సుదర్శన్ అన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత ఆదేశంతో మండలంలో కొత్త ఇసుకపల్లి, గోర్స గ్రామా కమిటీ అధ్యక్షుడు పెనుమల్లు శ్రీనివాసరెడ్డి, యాదాల ఏసుబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గ్రామసభలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు అవుతున్న విధానం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ, లేదంటే వాటి అమలకు గ్రామస్థాయి నుంచి పోరాటం చేస్తామని సుదర్శన్ హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలకి అవగాహన కల్పించారు. అన్ని సమయాల్లోను ప్రజలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని తెలిపారు. హామీలు అమలు చేయకుండా సూపర్–6 సూపర్ హిట్ అని ఏ మొఖం పెట్టుకుని చెబుతున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తావని అన్నారు. గ్రామాల వారీగా పార్టీ బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త ఇసుకపల్లి సర్పంచ్ తమ్మిలిశెట్టి సుబ్బిరెడ్డి, వాసంశెట్టి ఆదినారాయణ, పెదిరెడ్ల నాగేశ్వరరావు, జోన్నాడ సత్యనారాయణ, బెల్లంకొండ తాతిలు, ఏడిద అజమ్మ, ఏడిద చంద్రమ్మ, కాకర మరిరత్నం, కాదులూరి అదిభూషణంరెడ్డి, చింతపల్లి చల్లారెడ్డి, పెనుమళ్ల సతిష్‌రెడ్డి, సాక చిన్నాబ్బాయి, చింతపల్లి గంధవేణి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టడంలో 'గురజాడ' పాత్ర కీలకం


గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: కన్యాశుల్కం తీసుకొచ్చి బాల్య వివాహాలను అరికట్టడంలో గురజాడ వెంకట అప్పారావు పోషించిన పాత్ర చెరగవేయని ముద్ర అని సాహితీ స్రవంతి అధ్యక్షుడు జ్యోష్యుల కష్ణబాబు అన్నారు. గురజాడ జయంతి సభ ఆదివారం ప్రజా నాట్యమండలి, పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఘనంగా నిర్వహించారు. గురజాడ అందించిన దేశభక్తిని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని పలువురు పేర్కొన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజేష్‌కుమార్ దేవత, గూనూరి రమణ, పీఎన్ఎం నాయకులు ఆర్.వీర్రాజు, మహపాతిన రాంబాబు, డి.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

చిత్రలేఖన పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో బి.లతికా, వి.భార్గవి, సీనియర్స్ విభాగంలో టి.హేమంత్, సూపర్ సీనియర్స్ విభాగంలో అనిత ప్రథమ బహుమతి సాధించగా.. ఎం.ప్రణీత, సాయివీరచారి, ఎం.హాసిని, అమృతప్రియ, కె.ప్రశాంతి ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. కె.రేణుక, కెఎస్ అహ్మదభ్, సాహిదా, రేష్మ, డి.నేహాలు తృతీయ బహుమతులు సాధించారు.

'కలెక్టరేట్ ముట్టడి'ని జయప్రదం చేయండి


రంపయర్రంపాలెంలో నిరసన తెలుపుతున్న రైతుకూలీ సంఘం నాయకులు

గోకవరం: గ్రామంలో దళిత మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో బాధితురాలికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేయనున్న రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు రంపయర్రంపాలెంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికపై అత్యాచారం జరిగి పది రోజులు గడచినా కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కనీసం స్పందించకపోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఒక దళిత హోం మినిస్టర్ ఉన్న రాష్ట్రంలో దళిత మహిళలకు, అమ్మాయిలకు రక్షణ లేకుండాపోయిందని, మంత్రిగా స్పందించి అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని ఆర్థికంగా అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతూ సోమవారం రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ముసలయ్య, రమణ, వీర పండు తదితరులు పాల్గొన్నారు.

తలుపులమ్మను దర్శించుకున్న భక్తులు

తుని రూరల్: కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారిని ఐదువేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలిచ్చిన భక్తులు, భవానీ మాలధారణపరులు క్యూలైన్ల ద్వారా దర్శించుకున్నట్టు డిప్యూటీ కమిషనర్ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.69670, పూజా టికెట్లకు రూ.48650, తలనీలాలకు రూ.5240, వాహన పూజలకు రూ.4250, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.50862, విరాళాలు రూ.42982, వెరసి మొత్తం రూ.221654లు ఆదాయం లభించినట్టు ఈఓ తెలిపారు.

ఆశీనులై కరుణించవమ్మా..!


- నేటి నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం
- రోజుకో అవతారంలో అమ్మవారి దర్శనం
- ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


విద్యుత్ దీపాలంకరణలో భీమేశ్వర స్వామి ఆలయం

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా అమ్మవార్ల ఆలయాల్లో సోమవారం నుంచి ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఆలయాల వద్ద చలువ పందిళ్లు, విద్యుత్తు దీపాలంకరణలు చేశారు. స్థానిక పంచారామ క్షేత్రంలో ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబరు 2 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. సోమవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, దీక్షాధారణ, కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం దుర్గాసప్తపతి పారాయణ, బాలాపరమేశ్వరీ మంత్రజపం జరుగుతాయి. ప్రతి రోజు అమ్మవారు ఒక దేవతామూర్తిగా భక్తులకు దర్శనమిస్తారు.

అమ్మవారి అలంకరణలు ఇవే..


దసరా ఉత్సవాలు సందర్భంగా 22న అమ్మవారు బాలా త్రిపురసందరీ దేవిగా దర్శనమిస్తారు. 23న శ్రీఅన్నపూర్ణదేవి, 24న గాయత్రిదేవి, 25న శ్రీలలితదేవి, 26న కామాక్షి, 27న విజయదుర్గాదేవి, 28న మహాలక్ష్మీ, 29న సరస్వతీ దేవి, 30న మహిషాసుర మర్ధినిగా, ఒకటిన రాజరాజేశ్వరీ, రెండో తేదీన వెండి చీర అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారు. విజయదశమిని పురస్కరించుకొని మధ్యాహ్నం జమ్మి చెట్టు వద్ద శమీ పూజ ఉంటుంది. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ప్రతి రోజు అమ్మవారికి బంగారు కిరిటంతో అలంకరణ ఉంటుంది. మధ్యాహ్నం అమ్మవారికి చేసిన అలంకరణ మరుసటి రోజు మధ్యాహ్నం వరకు ఉంటుంది. చివరి రోజు సాయంత్రం అమ్మవారికి వెండి చీర అలంకరణ ఉంటుందని ఈఓ వివరించారు. రూ.200 చెల్లిస్తే శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజు గోత్ర నామాలతో సాయంత్రం కుంకుమార్చన చేస్తారని ఈఓ చెప్పారు.


సామర్లకోటలోని పంచారామ క్షేత్రం

ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం

అదే విధంగా మాండవ్య నారాయణస్వామి ఆలయం, స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయం, బడేలమ్మ చెరువు వద్ద ఉన్న నవదుర్గ ఆలయం, అయోధ్య రామపురంలోని కనకదుర్గ ఆలయం, సత్తెమ్మతల్లి ఆలయం, భాస్కర్‌నగర్‌లోని కనకదుర్గ ఆలయం, నీలమ్మ చెరువు వద్ద ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయం, బ్రౌన్‌పేటలోని కనకదుర్గ ఆలయాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏర్పాట్లను ఎమ్మెల్యే రాజప్ప పరిశీలించారు.


పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరీదేవి


వేట్లపాలెంలో బేతాళస్వామి

వేట్లపాలెం బేతాళస్వామి ఆలయంలో..

వేట్లపాలెం గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందిన బేతాళ స్వామి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు గ్రామంలోని ప్రజలు అందరూ కలిసి పార్టీల రహితంగా నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయానికి రంగులు, విద్యుత్తు దీపాలంకరణలు చేశారు. గ్రామ శివారులో ఉన్న బేతాళస్వామి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా తీసుకొచ్చి ఉత్సవాల్లో పూజలు చేస్తారు. చివరి రోజున బేతాళస్వామి సంబరం నిర్వహించి గ్రామ శివారులో బేతాళస్వామిని తీసుకెళ్లి వదలేస్తారు. ఈ మేరకు ఆలయ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.


అమ్మవారిని పూజించాలి



ఆశ్వయుజ మాసంలో శరదృతువులో అమ్మవారిని పూజించడానికి శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది 11 రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించడం వల్ల మంచి ఫలితాలు లభిస్తాయి. విజయదశమి రోజు శమీ పూజ చేయడంతో శత్రు నాశనం జరిగి, విజయాలు సాధించడానికి అవకాశం ఉంటుంది.

– సోమేశ్వరశర్మ, పంచారామ క్షేత్ర పండితులు, సామర్లకోట.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



శరన్నవరాత్ర ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు ప్రసాద వితరణ జరుగుతుంది. ఆలయంలో ప్రతిరోజు చండీ హోమం, స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రిదభిషేకం, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి సవావరణార్చన ఆలయ పండితులుచే జరుగుతాయి.

బళ్ల నీలకంఠం, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట.